క్లుప్తంగా

తడిసిన నువ్వు పంట

మైదుకూరు : నూర్పిడి కోసం కల్లంలో ఉంచిన నువ్వు పంట అకాల వర్షానికి దెబ్బతిని గింజలు మొలకెత్తాయని మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లెకు చెందిన మహిళా రైతు కూశెట్టి లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసిన నువ్వు పంట సోమవారం కల్లంలో తడిసి మొలకెత్తడంతో తీవ్రంగా నష్టపోయినట్టు ఆమె పేర్కొన్నారు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

రేపు మున్సిపల్‌ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపల్‌ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్‌ వై.రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో జరిగే సమావేశానికి పాలకవర్గం సభ్యులు, ఎక్స్‌ అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం పనుల పరిశీలన



పట్టణ ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని శ్రీరాములపేటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డి మంగళవారం పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయన్నారు. త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ డీఈ దాస్‌, ఏఈ ఉమామహేశ్వరి, కాంట్రాక్టర్‌ కృష్ణార్జునరెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల : రాష్ట్ర ప్రభుత్వం మే 1 నుంచి జూన్‌ 11 వరకు విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినా పోరుమామిళ్లలో కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు క్లాసులు నిర్వహిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అభిలాష్‌ ఆరోపించారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలని అధికారులను కోరారు.

ఇక స్పందన సచివాలయాల్లోనే

అట్లూరు : ఇకపై స్పందన కార్యక్రమం సచివాలయాలలోనే నిర్వహించనున్నట్టు తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ఇదివరకూ ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగేదన్నారు. అయితే ఇకపై సచివాలయాలలోనే ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కనుక ఆయా సచివాలయాలలోనే ఫిర్యాదులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. దీంతో సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు కలుగడంతోపాటు మండల కేంద్రానికి ఫిర్యాదుదారులు రావలసిన అవసరం లేదన్నారు.

భూముల ధరలపై సమీక్ష

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండల పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములతోపాటు రాష్ట్ర, జాతీయ రహదారుల సమీపంలో ఉన్న భూముల ధరలపై సబ్‌ రిజిస్ట్రార్‌ రామలక్షుమ్మ మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సబ్‌ రిజిస్ట్రార్‌ తహసీల్దార్‌ నజీర్‌ అహ్మద్‌, వీఆర్‌ఓలతో చర్చించారు. దొరసానిపల్లె, ప్రొద్దుటూరు, కొత్తపల్లె, తాళ్లమాపురం, రామేశ్వరం, సర్విరెడ్డిపల్లె, మోడంపల్లె ప్రాంతాల్లో భూముల ధరలు ఏవిధంగా ఉన్నాయి, వ్యవసాయేతర భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌ ధరలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ఈ సమీక్ష చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్‌, సతీష్‌, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేడు సెబ్‌ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని స్పెషల్‌ బ్యూరో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కార్యాలయ ఆవరణలో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్‌ ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెబ్‌ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దాతలు స్ఫూర్తిగా నిలవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : దాతలు తమ సేవా కార్యక్రమాల ద్వారా ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని బాలాజీ వైద్యశాల అధినేత డాక్టర్‌ కృష్ణకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దివంగత బీచు నాగేశ్వరరెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు మినరల్‌ వాటర్‌ తో కూడిన చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. అనంతరం ఆజాద్‌ నగర్‌ లోని బృందా వృద్ధాశ్రమంలో వృద్ధులకు, పలు కూడళ్ళలో ఆదరణలేని నిరుపేదలకు, వికలాంగులకు అన్నదానం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌ సింగారెడ్డి రామచంద్రారెడ్డి, బీచు నాగేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బీఎన్‌ఆర్‌ ఫౌండేషన్‌ వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ



గోపవరం: మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

గోపవరం : పార్టీలకతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాలువపల్లె సచివాలయం పరిధిలోని జంసారాభాయిపేట, లక్కవారిపల్లె, ఉప్పువారిపల్లె గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఆ కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరాలు వెల్లడిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించారు. సంక్షేమ పథకాలు రాని ఎవరైనా ఉన్నారా అని ఎమ్మెల్యే ఆరా తీయగా అలాంటి వారు ఎవరూ లేరని చెప్పడం గమనార్హం. 2019 ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మండల సచివాలయ కన్వీనర్‌ పుల్లయ్య, ఎంపీటీసీ రాజేశ్వరి, మాజీ సర్పంచ్‌లు శ్రీరాములు, సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు మల్లేష్‌, రామిరెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

బద్వేలు అర్బన్‌ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో ఉన్న రెడ్డయ్యమఠంవీధి, గుప్తానగర్‌లలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్‌ యద్దారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు చెన్నయ్య, రామ్మోహన్‌, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, శివయ్య, చెన్నకృష్ణారెడ్డి, బిజ్జం రమణ, నరసింహులు, ప్రతాప్‌ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మున్సిపల్‌ కమిషనర్‌ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్‌ సీఐ జి.వెంకటేశ్వర్లు వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాల లక్ష్యం పూర్తి చేయాలి

ఆర్డీఓ శ్రీనివాసులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రాజుపాళెం : ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని టంగుటూరు గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఆర్డీఓ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌ కాలనీలో ఇంకా కొంత మంది లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణం ప్రారంభించలేదని.. కారణాలేంటని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా 20 పక్కా గృహాలను ప్రారంభించలేదని, వాటి నిర్మాణం చేపట్టేందుకు గ్రామ, మండల స్థాయి అధికారులు సహాయ, సహకారాలు అందిస్తారని చెప్పారు. ప్రస్తుతం జగనన్న లే అవుట్‌లో ఇళ్లు నిర్మించుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని, త్వరగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి రాఘవేంద్రకుమార్‌, సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌ గోనా వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దార్‌ ఇందిర రాణి, ఎంపీడీఓ సయ్యదు న్నీసా, హౌసింగ్‌ డీఈ రామ్మోహన్‌, డిప్యూటీ తహసీల్దార్‌ సాయినాథరెడ్డి, హౌసింగ్‌ ఏఈ శేఖర్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ ఓబయ్య, వీఆర్‌ఓ సరళ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్‌ ఆఫీసర్‌

అట్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ డి.విశ్వంత్‌, సీహెచ్‌ఓ ఎస్‌.మునిరెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. అలాగే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి వారు వివరించారు. సమావేశంలో ఎంహెచ్‌ఈఓ కె.ఎస్‌.వి.ప్రసాద్‌, కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ సి.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది ఎం.లక్ష్మీదేవి, జి.మాణిక్యమ్మ, ఎం.వీరేంద్రబాబు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ మునిరెడ్డి ఆశ డే సమావేశంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి దాదాపు 3 గంటల పాటు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఇమ్యునైజేషన్‌ గురించి వివరించారు. ఆయన వెంట హెల్త్‌ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ ప్రసాద్‌, మెడికల్‌ ఆఫీసర్లు ఉన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యులంటే ఎనలేని గౌరవం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : వైద్యులు, గురువులు, రైతులంటే తనకు ఎనలేని గౌరవమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వీరిలో ఏ ఒక్కరు లేకున్నా మానవుల మనుగడ సాధ్యం కాదన్నారు. జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం వైద్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ప్రైవేట్‌ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ఇక్కడి వైద్యులు వారి వారి విభాగాల్లో ప్రజలకు వైద్య మెరుగైన సేవలను అందిస్తున్నారని కొనియాడారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రొద్దుటూరుతో పాటు నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల సమస్యలు తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చానన్నారు. వైద్యులపై గౌరవంతోనే డాక్టర్‌ ప్రసాద్‌రెడ్డి విగ్రహాన్ని గాంధీరోడ్డులో ఏర్పాటు చేశామన్నారు. తనకు కరోనా సోకి ఆరోగ్యం విషమించినప్పుడు డాక్టర్‌ రామకృష్ణారెడ్డి వైద్యం చేసి పునర్జన్మ ప్రసాదించారన్నారు. కరోనా సమయంలో వైద్యులే లేకుంటే జరిగే ప్రాణ నష్టాన్ని ఊహించడానికి కూడా సాధ్యం కాదన్నారు. వైద్యులందరూ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా వైద్యం చేశారని ఎమ్మెల్యే అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ప్రైవేట్‌ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ కోసం 10కిపైగా అనుమతులు తీసుకోవాల్సి వస్తుందని పలువురు వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఫైర్‌ సర్టిఫికెట్‌ ఇస్తేగాని ఇతర అనుమతులు ఇవ్వరన్నారు. సింగిల్‌విండో పద్ధతిలో రిజిస్ట్రేషన్‌ చేసేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో పాటు పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి, సెక్రటరి డాక్టర్‌ హరీష్‌కుమార్‌, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


పీసీ పల్లెలో సీసీ రోడ్డు నిర్మాణం



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌ చెన్నకృష్ణారెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గొడ్లవీడు గ్రామ పంచాయతీలోని పీసీ పల్లెలో గత కొన్నేళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల కోసం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్‌ చెన్నకృష్ణారెడ్డి ప్రారంభించారు. సర్పంచ్‌ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. అయితే ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలతోపాటు, పంచాయతీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ముద్రగడ'పై కేసు కొట్టివేత హర్షణీయం



ముద్రగడపై కేసు కొట్టివేసినందుకు వేడుకలు నిర్వహిస్తున్న బలిజ సంఘ నేతలు

కడప కల్చరల్‌ : కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై తుని రైలు దహనం కేసు కొట్టివేయడంపై కడప నగరానికి చెందిన బలిజ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం స్థానిక కృష్ణా సర్కిల్‌లోని శ్రీకృష్ణ దేవరాయులు విగ్రహం వద్ద బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్‌) అధ్యక్షులు దాసరి శివప్రసాద్‌ ఆధ్వర్యంలో పలువురు బలిజ నేతలు సమావేశమై రాయల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి కేక్‌ కట్‌ చేసి పంచుకున్నారు. ముద్రగడ పద్మనాభం 2016 జనవరి 30న తలపెట్టిన కాపు గర్జన సందర్భంగా నాడు తుని రైలు దహనం ఘటనతో ఆయనకు ముడిపెట్టి మరికొందరితో కలిసి ఆయనపై అక్రమ కేసు నమోదు చేశారని, దాన్ని సోమవారం కొట్టివేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసులో ఉన్న అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు.

నేడు గుంతచీపాడులో బండలాగుడు పోటీలు

చాపాడు : మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామంలో బుధవారం ఓల్డ్‌ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రుక్మిణీ వేణుగోపాల స్వామి సహిత గరుత్మాంతా మహా కుంభాభిషేక మహోత్సం సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.0వేలు, రూ.10వేలు, రూ.5 చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు



శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పల్లకిపై పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ముందుగా శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్‌ కానాల విజయలక్ష్మి, బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్‌ రామమోహన్‌, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్‌ పెయింటింగ్‌లలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, గర్ల్స్‌ ఐటీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్‌ పెయింటింగ్‌లలో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్‌ సెల్ఫ్‌ ఎంప్లాయ్‌మెంట్‌ డైరెక్టర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9440905478, 6302833546 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : తాము నిర్వహిస్తున్న వేసవి శిక్షణను అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని పీఆర్‌ కంప్యూటర్‌ సొల్యూషన్స్‌ సంస్థ ఎండీలు రెడ్డెయ్య, రెడ్డిరాణి, పరిమళ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొత్తగా ప్రారంభించిన పీఆర్‌ కంప్యూటర్‌ సొల్యూషన్స్‌లో పేద విద్యార్థులు కంప్యూటర్‌ విద్యను నేర్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఉపాధి పొందేందుకు అవసరమైన కంప్యూటర్‌ కోర్సులు, స్పోకెన్‌ ఇంగ్లీషు, కెరీర్‌ గైడెన్స్‌, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తామన్నారు. 5 నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఇందుకు అర్హులన్నారు.

టీబీ కేసులపై అప్రమత్తంగా ఉండాలి

మండల నోడల్‌ ఆఫీసర్‌ నాగేంద్ర కుమార్‌



మాట్లాడుతున్న నోడల్‌ ఆఫీసర్‌ నాగేంద్ర ప్రసాద్‌

చాపాడు : టీబీ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని మండల నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ నాగేంద్ర కుమార్‌ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్‌ ఆఫీసర్‌ మాట్లాడుతూ.. టీబీకి సంబంధించి ప్రతి నెలా ఐదుగురికి స్ఫూటం టెస్ట్‌లు చేయాలన్నారు. టీబీ ఉన్న వారిని ఎంఎల్‌హెచ్‌పీలు తప్పకుండా విజిట్‌ చేస్తూ వారికి సంబంధించిన కార్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీలో ప్రతి నెలా ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అనీమియా, హైరిస్కను ఉన్నవారిని గుర్తించి వారికి తగిన ఐరన్‌ ట్యాబ్లెట్లు సరైన ఆహారం, అంగన్వాడీలలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకునేటట్లు ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరంలో తప్పనిసరిగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి తప్పనిసరిగా అన్ని రకాలైన టీకా అందేటట్లు, ఇదే క్రమంలో కిల్కారి ఉపయోగాలను తెలియజేయాలన్నారు. ప్రతి నెలా రికార్డులను తప్పనిసరిగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్‌ రాజేష్‌ కుమార్‌, వైద్యులు ఓబులేసు, కావ్యమాధురి, సూపర్‌వైజర్‌ సరస్వతి, ఎఫ్‌పీసీ క్లస్టర్‌ పర్యవేక్షలు భాస్కర్‌, నారాయణరెడ్డి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటు



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం జీఓఆర్‌టీ నంబర్‌ 419ని జారీ చేసింది. ఆలయ పాలకమండలి సభ్యులుగా కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఎం.మల్లికార్జున శెట్టి, జి.గోవర్ధన్‌ రెడ్డి, కె.వెంకటసుబ్బయ్య, సీపీ నాగలక్షుమ్మ, ఎ.నాగేశ్వరి, డి.భారతి, బి.వెంకటేశు, పి.సావిత్రమ్మ, టి.మహేశ్వరశర్మను నియమించారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకారోత్సవంలో కొత్తమిద్దె రఘురామిరెడ్డిని ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మల్లికార్జున శెట్టి తదితరులు మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈశ్వరీదేవిమఠంలో మహాప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న మఠాధిపతుల అమ్మవారు విజయమ్మ

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, కుంకుమార్చన తదితరాలు చేపట్టారు. గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవానికి ప్రకాశం జిల్లా బచ్చలకూరపాడు గ్రామానికి చెందిన మాచా భక్తుని వీరభ్రమరాచార్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం మహాప్రసాదం వినియోగం కార్యక్రమం నిర్వహించారు. మహాప్రసాదానికి పులివెందుల నియోజకవర్గం లోపట్నూతల గ్రామానికి చెందిన పుల్లకూర వెంకటపతి, అచ్చమ్మ, రామయ్య, పార్థసారథివీరుడు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి



ఆలయ ఆవరణలో ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిని మంగళవారం ఏపీఎస్‌ఆర్‌ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్‌ ఎ.మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఫిట్‌ పర్సన్‌ శంకర్‌ బాలాజీ, మేనేజర్‌ ఈశ్వరయ్య ఆచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. చైర్మన్‌ వెంట రాష్ట్ర ఉద్యానవన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి బ్రహ్మంగారిమఠం నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కడప ఈడీ గోపినాథ్‌రెడ్డి, పూర్వపు మఠాధిపతి తమ్ముడు వీరభద్రస్వామి, పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రి స్వామి, దత్తాత్రేయ, రిటైర్డు ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యస్వామి, స్థానిక నాయకులు జోగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బద్వేలు డిపోను
పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

బద్వేలు అర్బన్‌ : బద్వేలు డిపోలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి అభివృద్ధి చేస్తామని ఆర్టీసీ చైర్మన్‌ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు డిపోను ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బద్వేలు డిపోలో కొన్నేళ్లుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. బద్వేలు డిపోకు అత్యాధునిక వసతులతో నూతన భవనం నిర్మించేందుకు అంచనాలు తయారు చేయమని ఇప్పటికే అధికారులను ఆదేశించామని, అంచనాలు పూర్తయిన వెంటనే బద్వేలు డిపోకు నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్టాండు బయటి భాగంలో ఉన్న గదులను సైతం తొలగించి నూతన గదులను నిర్మించి ఎవరైతే ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారో తిరిగి వారికే కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ బద్వేలు సమీపంలో సెంచురీ ప్యానల్‌ పరిశ్రమ ఏర్పాటైన నేపథ్యంలో బద్వేలు డిపోలో మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ చైర్మన్‌ దృష్టికి తీసుకెళ్లగా.. వీలైనంత త్వరగా బద్వేలు డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, అడా చైర్మన్‌ గురుమోహన్‌, మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, సివిల్‌ సప్లైస్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గోపాలస్వామి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పుత్తా లక్ష్మీదేవి శ్రీరాములు, ఆర్టీసీ కడప జోన్‌ ఈడీ గోపినాథరెడ్డి, ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, డీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నాడు- నేడు' విధుల్లో నిబంధనలను సడలించాలి

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లాలోని నాడు- నేడు రెండవ విడత పనులు జరుగుతున్న పాఠశాలల్లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులందరూ వేసవి సెలవుల్లో తప్పనిసరిగా హాజరు కావాలన్న నిబంధనలను సడలించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ నాడు- నేడుతో మౌలిక వసతులపరంగా పాఠశాలలు అభివృద్ధి చెందడం సంతోషకరమని, అందుకు ఉపాధ్యాయులుగా అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. కానీ సెలవు రోజుల్లో వంతుల వారీగా రోజుకొకరు హాజరై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలనే నిబంధనలు విధించడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర నాయకులు రఘునాథ రెడ్డి, బాలగంగిరెడ్డి, ఇలియాస్‌ బాషా, రవిశంకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, రెడ్డెన్న, కడప మండల నాయకులు సాదిక్‌ అలీ, తులసీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

దోష నివారణ పూజలు

కడప కల్చరల్‌ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు.